4-3-99



# సంఘబహిష్కరణకు శిక్షమాటేమిటి?



బాలగోపాల్

విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలంలోని వసి అనే గ్రామం ఒక సంవత్సరం కాలంగా అడపాదడపా వార్తలలో ఉంది. ఆ ఊరి దళితులపైన ఆ ఊరి సవర్ణ కులస్తులు సంఘబహిష్కరణ విధించారు. గతసంవత్సరం ఏప్రిల్ నెలలో మొదలయిన ఈ సంఘబహిష్కరణ ఈనాటికీ కొనసాగుతున్నది. ఒక దశలో దళితులకు దుకాణందారులు సరుకులు అమ్మకూడదని రజక, నాయీబ్రాహ్మణకులాల వాళ్ళు తమ వృత్తిపరమైన సేవలు అందించకూడదనీకూడా ఆంక్షలు పెట్టారు. ప్రస్తుతం సంఘబహిష్కరణ అంత తీవ్రరూపంలో అమలు కావడం లేదు గానీ అన్నిటికంటే ముఖ్యమైన రంగంలో అమలు అవుతున్నది. దళితులను ఆ గ్రామ సవర్ణ రైతులు కూలి పనికి పిలవడం లేదు. వేరే గ్రామాలకు పోయి కూలి చేసుకునే అవకాశం పెద్దగా ఉండదు కాబట్టి (ప్రతీ గ్రామంలోనూ దినకూలి మీద ఆధారపడి బ్రతికే వాళ్ళుంటారు కదా) వసిగ్రామ దళితులు దాదాపు సంవత్సరంగా దినదినగండంగా బ్రతుకుతున్నారు. ఎక్కడయినా రోడ్డుపని లాంటిది దొరికితే ఆ రోజుకు తిండి దొరుకుతుంది. లేకపోతే నిన్నటి ఆదాయం కొంత మిగిలించి ఇరుగుపొరుగు వారు అరువిస్తే తినాలి. లేకపోతే పస్తులుండాలి.

అదే జిల్లా పాచిపెంట మండలం విశ్వనాథపురం గ్రామంలోనూ ఆరునెలలకుపైగా దళితులు సంఘబహిష్కరణకు గురయి ఉన్నారు. ఆ ఊరి రైతులు వాళ్ళను పనులకు పిలవడం లేదు. ఊరిలో సరుకులు ఒకరోజు కొనుక్కోనిస్తే ఒకరోజు కొనుక్కోనివ్వరు. పొరుగున ఉన్న గిరిజన గ్రామం వారిని ఆదుకొని కొంత పనులు కల్పించబట్టి సరిపోయిందిగానీ లేకపోతే విశ్వనాథ పురం దళితులు ఇంకెంత ఇబ్బందికి గురయ్యేవారో. అయినప్పటికీ వారికి ఒకరోజు పనిదొరికితే ఒకరోజు పస్తులుండే పరిస్థితే.

ఈ రెండు గ్రామాలలోనూ దళితులకూ సవర్ణులకూ మధ్య గొడవలున్నాయి. నిజానికి ఈ గొడవలు మొదలయినప్పుడు అవి సవర్ణులందరితోనూ గొడవలుగా మొదలుకాలేదు. ఏదో ఒక కులానికి సంబంధించిన కొందరు వ్యక్తులతో గొడవలుగా మొదలయ్యాయి. కానీ గొడవ మొదలయిన తరువాత దళితేతరులందరూ ఒక్కటయ్యారు. ఒక్కటయి కక్ష గట్టారు. ఈకక్షలలో భాగం కావడం ఇష్టం లేని వారు సవర్ణులలో లేకపోలేదు. ఇది అనాగరికం అనుకునే వారు సహితం లేకపోలేదు. కానీ పరాయివాళ్ళకోసం మనవాళ్ళతో గొడవ ఎందుకు పెట్టుకోవాలి అని అటువంటి వారు ఊరకుండిపోతారు.

ఆ గొడవలు ఎట్లాంటివి? అవేమైనా వ్యక్తిగత తగాదాలా? సారాప్యాకెట్ల దగ్గర కొట్లాటలా? వసిలో జరిగిందేమిటంటే దళితుల ఇళ్ళ సమీపంలోని గ్రామకంఠం భూమిలో ఒక రైతు బోర్ వేసుకుని ఇంజన్ పెట్టుకుని భూమిలోతులనుండి నీళ్ళు లాగి తన పొలాలకు పెట్టుకుంటున్నాడు. దానివల్ల దళితుల ఇళ్ళ దగ్గరున్న మంచినీటి బావిలో నీళ్ళు ఇంకిపోయాయి. ఆ బోర్‌ను ఆపమని దళితులు ఆందోళన చేయడంతో గొడవ మొదలయింది. అది దళితులందరి సమస్య కాబట్టి వాళ్ళంతా సహజంగా ఒకటయ్యారు. అవతలివైపున్నది ఒకరైతే అయినప్పటికీ దళితుల 'అహంకారాన్ని' సహించలేక వాళ్ళందరూ కూడా ఒకటయ్యారు. ఇంకా జరగవలసిన వన్నీ జరిగాయి. దళితులకు సంఘబహిష్కరణ విధించారు. వీళ్ళు గొడవ పెట్టుకొన్నారు. కూలికి పిలవకపోవడమేకాక ఒక అమ్మవారి పండుగ రోజు డప్పుకొట్టడానికి సహితం ఆ ఊరి దళితులను కాక పొరుగూరి దళితులను పిలవడం వసి గ్రామ దళితులకు చాలా కోపం తెప్పించింది. గొడవ పెట్టుకున్నారు. సవర్ణులు వారిపైన కర్రలతో కత్తులతో దాడిచేసి తరిమి తరిమి కొట్టారు. దళితులువాళ్ళపైన కేసు పెట్టి సంఘబహిష్కరణ ఎత్తివేయించడానికి అధికారులు కృషిచేయాలంటూ ఎంఆర్‌వో ఆఫీసు దగ్గర ధర్నా చేశారు. పోలీసులు వాళ్ళ పైన లాఠీచార్జి చేయగా కోపగించి ఎంఆర్‌వో ఆఫీసులోకి దూరి ఆ అధికారిపైన చేయిచేసుకున్నారు. దళితులపైన పోలీసులు కేసులు పెట్టారు, అరెస్టు చేశారు. కానీ సంఘబహిష్కరణ మాత్రం కొనసాగుతూనే ఉంది. ఎంఆర్‌వోను కొట్టడం చట్టవిరుద్ధం అయినట్టు దళితులను సంఘబహిష్కరణకు గురిచేయడం కూడా చట్టవిరుద్ధమే. కానీ ఈ నేరానికి మాత్రం కేసు లేదు. అరెస్టులు లేవు.

విశ్వనాథపురంలో కూడా దళితులు గొడవపెట్టుకున్నది ఒక న్యాయమైన హక్కు గురించే. భూమిసమస్య గురించి ఆందోళన చేశారు. వారిపైన మూకుమ్మడిగా ఇతర కులాలవారు దాడిచేశారు. ఒక దళిత స్త్రీని తీవ్రంగా కొట్టారు. వీళ్ళు పోలీసులకు ఫిర్యాదు చేసి ఎస్.సి, ఎస్.టి (అత్యాచారాల నిరోధక) చట్టం కింద కేసు పెట్టించారు. పోలీసులు తప్పనిసరయి కేసయితే పెట్టారు గానీ ఎవరినీ అరెస్టు చేయలేదు. పైగా దాడి చేసిన వారు మరింత రెచ్చిపోయి దళితులపైన సంఘబహిష్కరణ కట్టుదిట్టంగా అమలు చేస్తున్నారు.

> ప్రతీగ్రామంలోనూ దళితులపైన సంఘబహిష్కరణ అమలు చేస్తున్నారు. ఇదొక రకంగా భౌతిక దాడికంటే హానికరమైనది. దెబ్బలు తగిలితే నయమైన తరువాత మామూలుగా బతకొచ్చు. సంఘబహిష్కరణకు గురిచేస్తే కూలిదొరకదు. తిండిదొరకదు. ఈ బహిష్కరణ నెలల తరబడి సంవత్సరాల తరబడి సాగుతుంది. దళితులు ఆర్థికంగా పూర్తిగా చితికిపోయి 'దారిలోకి' రావాలి. అప్పుడే ఇది ఆగుతుంది.

ఇది ఈ రెండు గ్రామాల ప్రత్యేకత కాదు. ఉత్తరాంధ్రలో ముఖ్యంగా విజయనగరం జిల్లాలో దళితులు తమ హక్కులకోసం గట్టిగా నిలబడిన ప్రతిచోట ఇది జరుగుతూనే ఉంది. ఈ ప్రాంతంలో అంటరానితనం చాలా తీవ్ర రూపాలలో ఉంది. హోటళ్ళలో వేరు గ్లాసులు పెట్టడం దగ్గర మొదలుపెట్టి అన్ని రూపాల లోనూ ఉంది. చాలా కాలం ఎవరూ ప్రశ్నించనిది ఈమధ్యకాలంలో చదువుకున్న దళిత యువకులు, దళితసంఘాలు ప్రశ్నిస్తున్నాయి. హోటళ్ళలో రెండు గ్లాసులు తీసేయాలని ఆందోళన చేస్తున్నారు. భూములున్న రైతులు, భూస్వాములు ఆక్రమించుకున్న ప్రభుత్వ బంజర్లు వాళ్ళ స్వాధీనం నుండి తొలగించి తమకే పట్టా ఇవ్వాలని ఆందోళన చేస్తున్నారు. దీనికి జవాబుగా వారిపైన భౌతిక దాడులు జరుగుతున్నాయి. హత్యలు జరుగుతున్నాయి. అంతేకాక ప్రతీ గ్రామంలోనూ దళితులపైన సంఘబహిష్కరణ అమలు చేస్తున్నారు. ఇదొక రకంగా భౌతిక దాడికంటే హానికరమైనది. దెబ్బలు తగిలితే నయమైన తరువాత మామూలుగా బతకొచ్చు. సంఘబహిష్కరణకు గురిచేస్తే కూలిదొరకదు. తిండిదొరకదు. ఈ బహిష్కరణ నెలల తరబడి సంవత్సరాల తరబడి సాగుతుంది. దళితులు ఆర్థికంగా పూర్తిగా చితికిపోయి 'దారిలోకి' రావాలి. అప్పుడే ఇది ఆగుతుంది.

ఒకగ్రామం తరువాత మరొక గ్రామంలో అనేక సంవత్సరాలుగా ఇటువంటి దురంతాలు జరుగుతూనే ఉన్నాయి. జిల్లాలోని రాజకీయ నాయకులంతా ఒకటిరెండు పెత్తందారీ కులాలకు చెందినవారు కావడంతో ఈ అన్యాయాన్ని వ్యతిరేకించే నాయకులెవరూ లేకుండా పోయారు. హక్కుల కోసం ఆందోళన ప్రారంభించిన దళితులు ఆకలి తప్పించుకోవడానికి హక్కులను వదులుకొని కాళ్ళబేరానికి రావలసి వస్తున్నది.

అధికార యంత్రాంగం దీని గురించి ఏమీ చేయజాలదా? ఎన్నిసార్లు ఎంతమంది ఫిర్యాదు చేసినా దళితులు ఎంతగా ఆందోళన చేసినా ఏమీ ఎందుకు చేయడం లేదు? ఈ సంఘబహిష్కరణలో రెండు రకాల నేరాలున్నాయి. దళితులయిన వారికి ఏమీ అమ్మొద్దు ఏ సేవలూ చేయవద్దు అని నిషేధం పెట్టడం పిసిఆర్ చట్టంలోని సెక్షన్ 6 కింద నేరం. వారిని పనిలోకి పిలవొద్దు అని నిషేధం పెట్టడం సెక్షన్ 4 (iii) కిందనేరం. వీటికి శిక్షతక్కువేగానీ ఇవి నేరాలే. ఈ నేరాలు జరిగితే కేసులు పెట్టాలి. అరెస్టు చేయాలి. ఇవి కాగ్నైజబుల్ నేరాలు కాబట్టి ఎవరూ ఫిర్యాదు లేకపోయినా పోలీసులు కేసు పెట్టొచ్చు. కానీ వింత ఏమిటంటే విజయనగరం జిల్లాలో ఈ నేరం జరిగిన ఏఒక్క ఊరిలోనూ ఈసెక్షన్ల కిందకేసులు పెట్టడం లేదు. ఎన్నిసార్లు ఎంతమంది పోలీస్ అధికార్లకూ మెజిస్టీరియల్ అధికారాలున్న రెవిన్యూ అధికార్లకు ఈ సెక్షన్లు చూపించి వారి విధులు వారికి జ్ఞాపకంచేసినా కేసులు పెట్టడం లేదు.

పై రెండు సెక్షన్లకింద సంఘబహిష్కరణకు బాధ్యులయిన వారిపైన కేసులు పెట్టడమే కాదు సెక్షన్ 10 —ఎ కిందవారిపైన సమష్టిగా జుర్మానా కూడా వసూలు చేయవచ్చు. బహిష్కరణకు పాల్పడిన దుకాణందారుల లైసెన్సులు సెక్షన్ 8 కింద రద్దు చేయవచ్చు.

ఈ సెక్షన్లేవీ ఆ జిల్లా అధికార యంత్రాంగం కళ్ళకు కనిపించడంలేదు. దళితులు తమ ఆందోళనలో భాగంగా పాల్పడిన ప్రతీ చట్టవిరుద్ధమైన చర్యకూ వారిపైన కేసులు మాత్రం పెడుతున్నారు. ముగ్గురు దళిత నాయకులపైన రౌడీషీట్లు కూడా పెట్టారు.

అయితే ఈ దురాచారం కేవలం పిసిఆర్ చట్టం కిందపెట్టే కేసులతో పోదు. వాటికి శిక్ష తక్కువ, బెయిల్ సులభం. సాక్ష్యం ఎవరినీ చెప్పనివ్వరు. అందువల్ల వేరేరూపాలలో ఒత్తిడిపెట్టే మార్గం ఆలోచించవలసి ఉంటుంది. అంటరానితనం రాజ్యాంగ విరుద్ధమనీ అనాగరికమనీ విస్తృతంగా ప్రచారం చేయడం అవసరం. దానిపైన చర్చపెట్టడం అవసరం. ఇది కేవలం ప్రభుత్వం బాధ్యత కాదు మనందరి బాధ్యత కూడా. దళితేతర కులాల వారిని ఆలోచింపజేయడానికి ఇది అవసరం.

అయితే దీనితో బాటు గ్రామ పెత్తందారీ వర్గాలను ఇబ్బంది పెట్టే ఒత్తిడి కూడా అవసరం. అంటరాని తనం పాటించడం కొనసాగిస్తే వారి ప్రయోజనాలు దెబ్బతింటాయన్న ఒత్తిడి అవసరం.

ఈ పెత్తందార్లు అనేక అభివృద్ధి పనులకోసం ప్రభుత్వం దగ్గరికి వస్తుంటారు. వీటిలో కొన్ని (ఉదాహరణకు గ్రామంలో మంచినీటి వసతి వంటివి) గ్రామ ప్రజల నిత్యజీవిత అవసరాలకు సంబంధించినవి. వాటిమీద ఆంక్షలు పెట్టడం సబబుకాదు. కానీ అన్ని ప్రయోజనాలూ అటువంటివి కావు. కొన్ని ప్రధానంగా కాంట్రాక్టులకోసం కోరుకునేవి ఉంటాయి. అటువంటి అభివృద్ధి పనులకోసం గ్రామ సర్పంచ్‌లూ రాజకీయనాయకులూ ప్రభుత్వం దగ్గరికి వచ్చినప్పుడు ఊరిలో అంటరాని తనం పాటించడం మానేయకపోతే దళితుల సంఘ బహిష్కరణ మానేయకపోతే పనులు మంజూరు చేయం అన్న ఆంక్ష పెట్టే విధానం ఉండాలి. అంటరానితనం రాజ్యాంగ విరుద్ధం కాబట్టి పిసిఆర్ చట్టం సెక్షన్ 16 —బి కింద ప్రభుత్వం అటువంటి జీవో జారీ చేస్తే అది తప్పక చెల్లుబాటు అవుతుంది.

నిజానికి ఒక గ్రామంలో ఒక పక్క దళితులను వెలివేస్తుండగా అంటరానితనం నిత్యం పాటిస్తుండగా ప్రభుత్వం జన్మభూమి అనీ మరొకటనీ ఆ ఊరికి అభివృద్ధి పనులు మంజూరు చేస్తూ ఆ ఊరి నాయకులకు రాజకీయ పరపతి, కాంట్రాక్టుల ద్వారా ఆర్థిక ఆదాయం కల్పిస్తూ ఉండడం చాలా వికృతమైన దృశ్యం. జిల్లా కలెక్టర్ల వంటి అధికారులకు ఆ విధంగా కనిపించకపోవడం ఆశ్చర్యం కలిగించే విషయం.

రాష్ట్రాన్ని 21 వ శతాబ్దంలోకి తీసుకుపోవడానికి అన్ని పార్టీలూ తొందరపడుతున్నాయి. కాబట్టి ఈ శతాబ్దాల నాటి అనాగరికమైన ఆచారాన్ని ఆలోపల పూర్తిగా తొలగించడానికి ఇటువంటి ఆలోచన ఏదైనా చేస్తారా?